

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

కమల పెదవులు తడారి పోయాయి. నాన్నే చెప్పారా? కూతురి ప్రేమ కంటే స్నేహం ముఖ్యమనే బోడి సిద్ధాంతమూ, ఆదర్శమునా నాన్నది?

"సుధీర్ నీకు వ్రాస్తూ మాకు వ్రాశాడొక ఉత్తరం. ఇలా కమలను పెళ్లాడతానంటూ. వెంటనే బొంబాయి వెళ్లి సుధీర్ ను పిల్చుకు వచ్చాను. శుభాలేఖలు అచ్చు వేయించేశాను.

కమలా! మీ నాన్న ఆలోచించ గలిగిందీ, చెప్పగలిగిందీ క్షుణ్ణంగా చెప్పారు  నీకు. అయితే నువ్వది అందుకోలేక పోయావు.

ఇప్పుడు నే చెబుతాను విను.

మేం డబ్బున్నవాళ్ళం కమలా! డబ్బు సంపాయించటం మా ఊపిరి. ఆ సంపాయించినదాన్ని మరింత పెంచటం మా ధ్యేయం. తరతరాలకు డబ్బు నిలవ చేయటం ఎలా అన్న ఆలోచనే మా శ్వాస. మా గుండెలలో 'లబ్ డబ్' అనే ధ్వని

వినిపించదు డాక్టర్లకి. 'డబ్ డబ్' అన్న శబ్దం ఒక్కటే వస్తుంది. కారణం మా ధమనుల్లో, సిరల్లో, రక్తంలో, రక్త కణాలలో మనసులో, మెదడులో నిండి వుండేది డబ్బును గురించిన ఆలోచనే.

సుధీర్ మాకు ఒక్కగానొక్క మేనల్లుడు. వాడి ఆస్తి అంతా ఎక్కడికీ పోవటానికీ, ఎవరికీ చెందటానికీ వీల్లేదు. అది రూలు. వాడు అర్ధాయుష్షు వాడన్నాడో జ్యోతిష్కుడు ఓ మారు. నాకు నవ్వొచ్చింది.

'కనీసం వాడి పెళ్లి వరకూ బ్రతుకుతాడేమో. జాతకం వేసి చూడండి. పెళ్లి జరిపించేస్తాం మా అమ్మాయి శాంతితో. ఆ తర్వాత వాడు చచ్చినా నే దిగులుపడను. వాడి డబ్బు, ఆస్తి లీగల్ గా మా అమ్మాయివీ, దాని పిల్లలవీ.(వాడు చచ్చే లోగా పుడితే) అవుతాయి. చాలు' అన్నాను.

జ్యోతిష్కుడు నిర్ఘాంతపోయి నిలువుగుడ్లు వేసాడనుకో. నా నిజమయిన అభిప్రాయం కూడా అంతే.

అలాగే మా చెల్లాయి... ఎవరు, సుధీర్ తల్లి, మా బావమరిదిల ఉద్దేశ్యమూ అంతే. ఈ పెంచుకున్న సంపదను పెంచి పోషించే కోడలే కావాలి గానీ, ప్రేమలు... ప్రేమలన్నవి వుట్టి నాటకాల మాటలు.

ఇక సుధీర్ నిన్ను ప్రేమించాడన్నాడుగా! ప్రేమించనీ? మరింత మందిని ప్రేమించనీ. మాకెవరికీ ఏ అభ్యంతరాలు లేవు. కుర్రచేష్టలని నవ్వుకుని వూరుకుంటాం. వాడి మేనమామనైన నాకే ఎన్నో ప్రేమ వ్యవహారాలుండగా, వాడికీ వయసులో యిలాటి 'చిరుతిళ్ళు' ధ్యాస వుండటం తప్పు లేదని చెబుతాను.

ఎటొచ్చీ సంవత్సరం తర్వాత వాడు  నిన్ను పెళ్లాడతాడని నువ్వు కనిపెట్టు క్కూర్చున్నావంటేనే మాకు నవ్వొస్తోంది. సంవత్సరంలోనూ, మరో పన్నెండు మంది కమలలకూ, విమలలకూ మాటలిచ్చినా, ఉత్తరాలు రాసినా ఆశ్చర్యం లేదు వాడు.

మా శాంతికి తెలుసు, వీడి తిక్కనెలా వదిలించాలో.

వాడి వ్యాపారమూ నావ్యాపారమూ కలిసి వున్నాయి. మాకు సమాన వాటాలున్నాయి. అవన్నీ నీ కోసం త్యాగం ఏనాడూ వాడూ చెయ్యడు. మేమూ చెయ్యనివ్వం. ప్రేమ ప్రేమని నీ వెంట బుక్కా ఫకీరుగా ఏనాటికీ రాడు.

కాబట్టి అనవసరమైన ఆలోచనలు మానుకో. హాయిగా మీ నాన్న తెచ్చే సంబంధాలలో  ఏదో ఒకటి అంగీకరించు. వాత్సల్యంతో మేడ మీదకు వెళతావా? శాంతి సుధీర్ కేరమ్స్ ఆడుకుంటున్నారు. సుధీర్ తో ప్రత్యేకంగా మాట్లాడాలనుంటే మాట్లాడు. మా అభ్యంతరం ఏమీ లేదు."

కమల సోఫాకు అంటుకు పోయి కూర్చుంది పోయింది చాలా సేపు.

"శాంతిని పిలవనా? నిన్ను మేడ మీదకు పిల్చుకు వెళుతుంది" అన్నారాయనగారే మళ్ళీ.

"ఒద్దొద్దు." తడబాటుగా అంది. ఆయనగారిలా సోఫాలో కూర్చుంటే, తాను ప్రేమించిన యువతి కోసం ఆమె భర్తని నిలువునా హత్య చేయించిన నవాబులూ, తన కొడుకు ప్రేయసిని సజీవ సమాధి చేయించిన మొగలాయి చక్రవర్తులు, తన కూతురు ప్రేమించిన వాణ్ని నిలువునా పెద్ద 'రాగి అండా'లో వుండగా క్రింద మంట పెట్టి అమానుషంగా చంపించిన నవాబులూ, రాజ్యం కోసం కన్నతండ్రిని చెరసాల లోకి తోయించిన వాళ్ళూ, విషాలు పెట్టి సవతి బిడ్డలలందర్నీ చంపించిన మాతృమూర్తులు, ఒకరేమిటి భోగలాలసతలో, డబ్బు హజంలో దోపిడీలు మొదలు, హత్యల వరకూ ఏ ఒక్కదానికీ వెనుదీయని ఎందరెందరో గుర్తుకు వస్తున్నారు. శరీరం రోమాంఛితమైంది ఒక్కసారిగా.

ఒకవేళ సుధీర్ మొండిగా తననే ఈ వారం రోజుల్లోగా పెళ్ళాడి వుంటే, ఈ రోజు తానిలా సోఫాలో గాక ఈ బంగళాలో ఎక్కడో పీక పిసకబడి పూడ్చి పెట్టబడి...

"వస్తాను బాబాయ్." గబగబా బయటకు వచ్చేసింది. తన కూతురు పసుపు కుంకుమల కంటే తన అల్లుడి ఆస్తే ఎక్కువని చెప్పిన కేశవరావుగారి మాటలు పిశాచపు ధ్వనుల్లా వెన్నంటుతూనే వున్నాయి, ఇంటికి వచ్చాక కూడా.

కానీ సుధీర్ తో ఏకాంతంగా మాట్లాడే అవకాశమే వుంటే అతగాడేం చెప్పేవాడో... అనే ఆలోచన తెగటం లేదు.

శాంతి పెళ్లి చాలా ఆడంబరంగా జరిగింది. కేశవరావుగారి వేపు లక్షాధికారి బంధువులంతా వచ్చారు. కళ్ళు జిగేలుమనిపించే నగలతో, పట్టుచీరెలతో ఆడవాళ్ళు చాలా స్టయిల్ గా వున్నారు.

కమల పట్టు పరికిణీ, ఓణీ, జాకెట్టు వేసుక వెళ్ళింది. అసలు పెళ్ళికి వెళ్ళాలనుకోలేదు. కానీ స్నేహితురాళ్ళందరూ, లేడీ లెక్చరర్లు అత్యంత ఉత్సాహంతో వెడుతున్నారు. పెళ్లి పొరుగూర్లో కూడా కాదు. స్నేహితురాళ్ళలో నలుగురైదుగురు కమల వెంట వెళ్లేందుకు సిద్ధమై వచ్చేశారు కూడాను. అలాంటప్పుడు తను వెళ్ళక పోతే ప్రత్యేకం వెలితి పడ్డట్లు వుంటుంది. ఓ స్టీలు మేకప్ బాక్సు కొని పట్టుకెళ్ళింది.

కేశవరావుగారు ఆదరంగా పలకరించారు. మీనాక్షమ్మ కూడా ముభావంగానే అయినా ఆదరం చిరునవ్వులో కలిపి పలకరించింది. పెళ్ళికూతురి అలంకరణలో పెద్ద పట్టుచీరెలో వంటి నిండా నగలతో కళ్యాణతిలకంతో వెలిగి పోతున్న శాంతి మాత్రం కమలను చూసి, "ఓహో! వచ్చావా!" అంది అంతే.

మిగతా స్నేహితురాళ్ళతో కిలకిల నవ్వుతూ కబుర్లు చెప్పిందే గానీ కమల అక్కడ వున్నట్లు ప్రవర్తించ లేదు. పైగా ఆమె బంధువులలో, ఆమె సమ వయస్కులయిన వారితో కమలను చూపుతూ కమలకు వినిపించ కుండా ఏవో

చెబుతోంది. బహుశా 'ఈ కమల నా సుధీర్ ను నానుంచి వేరు చేయాలని చూచింది' అని చెబుతోందేమో ననిపించి కమల చాలా బాధ పడింది.

పెళ్లి జరుగుతుండగా సుధీర్ తనవేపు చూస్తాడేమో, అతగాడి కళ్ళలో పశ్చాత్తాపం కనిపిస్తుందేమోనని ఎదురు చూచిన కమలకు అక్కడా నిరాశే ఎదురయింది. సుధీర్ శాంతితో హుషారుగా పెళ్లి మంటపంలోనే కబుర్లు చెబుతున్నాడు.

శాంతి పరిచయం చేసిన శాంతి స్నేహితురాళ్ళు నలుగురయిదుగురితో నవ్వుతూ మాట్లాడాడు. అతగాడి ఫ్రెండ్స్ తో కబుర్లు చెబుతున్నాడు. కానీ కమల అక్కడ వున్నట్లు గుర్తించలేదు.

చూడలేదా? చూడక పోవటానికి తనేం చాటుగా కూర్చోలేదే? పదిమార్లు అటు యిటు తిరిగింది చూడాలనే.

సుధీర్ కీ తనకీ పెళ్లి అయి ఉండవలసింది. అసలు నాన్నే యిష్ట పడలేదు. మరో తండ్రి అయి వుంటే, తన కూతురు లక్షాధికారి సుధీర్ ను పెళ్ళాడి సుఖ పడుతుంది లెమ్మనుకుని, ప్రోత్సహించేవాడు. పనిమాలీ, కేశవరావు బాబాయిగారి చేత కూడా తనకి చెప్పించాడు. అదేమంటే అంతస్తంటాడు. ఛ.. ఛ! ఇలాటి కన్నతండ్రి ఏ ఆడపిల్లలకి వద్దూ. కమలకి తండ్రి మీద అపరితమైన కోపం, ద్వేషం ఉప్పెనలా లేచాయి లోలోపల.

సుధీర్, తను పెళ్ళాడి వుంటే ఈ శాంతి ఈ రోజెలా ప్రవర్తిస్తోందో, తను శాంతిని చూస్తూ అలా ప్రవర్తించేది. కానీ ఆ అవకాశం తన నాన్న తనకివ్వలేదు.

"అక్షింతలు అందరూ చల్లుతూంటే నువ్వు చల్లవేమిటే?" అంటూ స్నేహితురాలు రోహిణి గట్టిగా జబ్బ మీద చరిచేవరకూ కమలకు అర్థం కాలేదు. విందు పూర్తయ్యాక శాంతి, సుధీర్ లకు అందరూ వెళ్ళొస్తామని చెప్పి శలవు తీసుకుంటున్నారు. కమల కూడా వెళ్ళింది. సుధీర్ కళ్ళు క్షణకాలం కమల కళ్ళతో కలుసుకున్నాయి. ఆ కళ్ళలో 'గిల్టీనెస్' ఎక్కువగా కనిపించలేదు గానీ, ఏదో చెప్పాలన్న తపన వుందనిపించింది. ఆ క్షణంలోనే ఇరువరికేసి తీక్షణంగా చూసింది శాంతి. సుధీర్ పక్కన వున్న ప్రజంటేషన్ పుస్తకం కవరు పరిశీలించ సాగాడు.

"వెళ్ళొస్తా శాంతీ" అంది కమల.

"ఆఁ! ఇక నేను సుధీర్ బావ బాంబే వెళ్లి పోతాం తొందర్లోనే. వెళ్ళే ముందు నిన్ను కలుసుకోవటానికి వీలుండదు కమలా! నీ స్నేహితురాలిగా నాదో సిన్సియర్ సలహా. త్వరగా పెళ్ళాడెయ్. మళ్ళీ ప్రేమంటూ మొదలెట్టి ఇతరులెవరినో మనసు నొప్పించకు."

కమల విసవిస బయటకు వచ్చేసింది, ఇంటికి వచ్చాక వెక్కిళ్ళు పెట్టి ఏడ్చుకుంది లోలోపల. శాంతి అలా సలహా ఇవ్వకుంటే ఏం? ఆమె అక్కసు తీర్చుకుంది కాబోలు. అలా శాంతి అంటుంటే సుధీర్ వారించలేదేం? జీవితంలో ఎప్పుడేనా ఒంటరిగా సుధీర్ ఒక్కసారి... ఒక్కసారి తను కలుసుకోగలిగితే చాలు.... తనలోని ఈ నాటి ప్రశ్నలన్నిటికీ సమాధానాలు అడిగి తీరాలి.

శాంతి అవమానపరచింది. వీలుంటే శాంతిని తిరుగు దెబ్బ కొట్టి తీరాలి. శాంతి మీది కోపం అంతా తండ్రి శ్రీహరిరావుగారి మీదకు పదింతలుగా పెరిగింది కమలకు,

"మాస్టారూ! నమస్కారం. బావున్నారా?"

త్రుళ్ళిపడ్డట్లు తలెత్తి చూసారు శ్రీహరిరావుగారు. అప్పుడే తిరుమల నుంచి వస్తున్నారాయన. తిరుపతి దేవస్థానం బస్ స్టాండులో బస్సు దిగి గోవింద రాజస్వామి ఆలయం కేసి వెడుతున్నారు.

"ఆఁ! బాగానే వున్నాను. కానీ బాబూ! నువ్వెవరో చప్పున గుర్తు రావటం లేదోయ్" అన్నారు నొచ్చుకుంటున్నట్లు.

"శేషాచారిగారి చంద్రాన్ని మాస్టారూ! వరంగల్ లో ఎం.బి.బి.ఎస్. థర్డ్ ఇయర్ చదువుతున్నాను. ఫ్రెండ్స్ తో తిరుపతి వచ్చాను. రేపు వెళతాను."

"ఓ... చంద్రం నువ్వా! బావున్నావా? శేషాచారి బావున్నారా? నువ్వు డాక్టర్ కోర్సు చదవటం నాకెంతో ఆనందంగా వుంది" అన్నారాయన, చంద్రాన్ని వెన్ను మీద వాత్సల్యంగా నిమురుతూ.

"మీ ఆశీర్వచన ఫలితం మాస్టారూ! సైన్స్ లో ఫస్ట్ మార్కు వచ్చినపుడల్లా 'నువ్వు దాక్తరువు కావాలి చంద్రం' అనేవారు మీరు. నేనూ కలలో కూడా అనుకోలేదు, నాకు సీటు వస్తుందనీ, చదవగలననీ" అన్నాడు చంద్రం.

"ఎవరు చెప్పగలరు చంద్రం? విధి ఎవరిని ఎలా మలుస్తుందో? మా కమలని డాక్టర్ని చేయాలని ఎంతగా ప్రయత్నించాను. అది ససేమిరా అంది. పోనీ, బి.ఇడి. పాస్ చేయించి టీచర్ గా చేస్తే ఉత్తమోత్తమైన ఉపాధ్యాయ వృత్తి చేపడుతుందనుకున్నాను. ఊహుఁ! ఏమీ కాలేదు, ఇంటర్ తో చదువాపేసి ఇంట్లో కూర్చుండి పోయింది. ప్రైవేటుగా చదవమంటే చదవదు. ఎంచేతో కన్నతండ్రినైన నా మీద అపరిమితమైన ద్వేషం ఏర్పడింది. పెళ్లి చేసి పంపుదామంటే నేను తెచ్చిన ఏ మనువూ నచ్చదు. నాకేమిటో అంతా అగమ్యంగా వుంది నాయనా. మనశ్శాంతి బొత్తిగా కరువై పోయింది. ఎంచేతో ఏడుకొండల వాడినొకసారి దర్శించి వెళదామని బుద్ధి పుట్టి వచ్చాను." ఆయన మాటలలో చెప్పలేని ఆవేదన.

చంద్రం నొచ్చుకున్నాడు. 'ఆదర్శ ఉపాధ్యాయుడు' అనదగిన శ్రీహరిరావు మాస్టారికి వృద్ధాప్యంలో మనశ్శాంతి లేదు. అదీ వాళ్ళమ్మాయి వల్లనట! బహుశా మాస్టారు పెద్ద సంబంధం తేలేదని నచ్చటం లేదోమో అమ్మాయికి. ఆ అమ్మాయిని తను చూడలేదు ఇంతవరకూ.

తనకెవరున్నారు? మరో రెండేళ్లలో డాక్టరు కాబోతున్నాడు. స్కాలర్ షిప్ మీదా, కేశవరావుగారు జాలి తలచి మిగతా ఖర్చులు భరిస్తాననటం వల్లా చదవ గలుగుతున్నాడీ  కోర్సు. కేశవరావుగారు చాలామంది విద్యార్థులకు ఇలా విద్యాదానం చేశారు. చేస్తున్నారు కూడా.

ఒక్కగానొక్క కూతురు శాంతికి పెళ్ళిచేసి పంపేశారు. కూతురు, అల్లుడు వ్యాపారరీత్యా బొంబాయిలో స్థిరపడ్డారు. ఇక వున్న డబ్బు, బ్లాక్ మనీ, విరాళాల రూపంలో ఖర్చుపెట్టి మంచి కీర్తి తెచ్చుకుంటున్నారు. డబ్బున్నా, దానిని సద్వినియోగం చేయగల సద్బుద్ధి ఎందరికి కల్గుతుంది?

"ఏమిటో చంద్రం!"

ఇందాకా ఏం చెప్పారో ఏమో, తను సరిగా వినలేదు. శ్రీహరిరావుగారు నిస్పృహగా అన్న చివరి మాటలతో త్రుళ్ళిపడ్డాడు చంద్రం.

"మీ ఆఖరి అమ్మాయి పెళ్లి ఒక్కటే మీకున్న సమస్య అయితే, మీరింతగా బాధపడనవసరం లేదు మాస్టారూ. మీకు నా మీద 'మంచి పిల్లాడన్న' నమ్మకం వుంటే చాలు. నేను పెళ్ళాడతాను మీ అమ్మాయిని. మీరు చెప్పినదాన్ని బట్టి ఆ అమ్మాయి ఇంటర్ పాసై రెండేళ్ళయింది అవునా?"

శ్రీహరిరావుగారు క్షణకాలం దిగ్భ్రాంతి పొందారు. తర్వాత గట్టిగా చంద్రాన్ని కౌగిలించుకున్నారు.

"చంద్రం! నీలాటి కుర్రాళ్ళు ఎంత మంది ఉన్నారీ లోకంలో? నేను నీకు ప్రత్యేకించి సైన్స్ పాఠాలు చెప్పింది లేదు. కానీ, నా ఆశీర్వచనం మీద నీకంత గురీ, గౌరవం, అభిమానం ఏర్పడ్డాయి. అదే నాకు లక్షలు విలువ చేసే గురుదక్షిణ. చాలు బాబూ! చాలు అదొక్కటే చాలు.

ఇక మా అమ్మాయి సంగతంటావా? దాని ఆలోచనల తీరు వేరుగా వుంది. ఓ ఇంజనీరు సంబంధం తెచ్చాను. అమ్మాయి కోసం పదిహేనువేలు ఫిక్స్ డు డిపాజిట్టు చేసి ఉంచాను. ఆ ఇంజనీరు కుర్రాడు పీలగా వున్నాడు. ఒద్దు పొమ్మంది. మరో లెక్చరర్ కుర్రాణ్ణి చూసాను. వాడు బాగా లావుగా వున్నాడు పొమ్మంది. ఇంకో బ్యాంకిలో ఉద్యోగం చేస్తున్న కుర్రాణ్ణి చూశాను. ఊహుఁ! వాడు ఛామనఛాయలో వున్నాడు పొమ్మంది. అందరు కుర్రాళ్ళూ మా అమ్మాయిని నచ్చారు. ఇక వద్దనేసరికి, అవతలి వారికీ సాకులు చెప్పి తప్పుకునేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది. ఆడపిల్లలకి

పెళ్ళిళ్ళు కావటమే గొప్పగా వున్న ఈ రోజులలో, నా మీద వున్న గౌరవం కొద్దీ వచ్చిన మంచి సంబంధాలన్నిటినీ ఇలా కాలదన్నేసింది. నాకెటూ పాలు పోలేదు. నువ్వు చేసుకుంటావు. కానీ అది నిన్ను నచ్చదు. నీవు ఛామనఛాయలో వున్నవాడివే గదా!"

చంద్రానికి ఆశ్చర్యం కలిగింది. మాస్టారుగారమ్మాయి అంతటి 'భూలోక రంభా?' ఆమెకు ఏ సంబంధమూ నచ్చక పోవటం చాలా చిత్రంగా కనిపిస్తోంది.

"నిజంగా ఈ సంబంధాలన్నీ దానికి నచ్చక కాదు. అదోరకంగా నా మీద కక్ష తీర్చుకో దలచు కుంది. నన్ను సాధించ దల్చుకుంది. అది అర్థం చేసుకున్నాను నేను."

"మీ మీద మీ అమ్మాయికి కక్షేమిటి మాస్టారూ?" ఆశ్చర్యంగా అడిగాడు చంద్రం.

"అదంతా ఓ పెద్ద కథ చంద్రం. చెప్పుకోవటం నాకు ఇష్టం లేదు. కానీ దాని ఊహల్లో ఓ కోటేశ్వరుడైన రాకుమారుడు లాటి పెళ్ళికొడుకు రావాలి. తాను పై అంతస్తులో కూర్చుని, తనని కొన్ని విషయాలలో అవమాన పరచిన వారిని కించ పరచగలగాలి.

అది జరిగే పని కాదని నాకు తెలుసు. కానీ దానికీ తెలుసు. చంద్రం! జీవితంలో పొందిన దానితో తృప్తి పడే మనస్తత్వం గల ఏ వ్యక్తి అయినా సరే, తాను సుఖపడి, ఇతరులను సుఖ పెడతాడు. అది లేనివారు తమ ద్వేషంతో, తమ అసంతృప్తి తో తమని తామే దహించుకుంటారు.

నాకిక్కడికి వచ్చాక, శ్రీవేంకటేశ్వరుని దివ్య మంగళ విగ్రహం చూస్తూ ఆత్మార్పణ చేసుకున్న సమయంలో ఏదో స్వాంతన లభ్యమయినట్లనిపించింది. నాయనా! విధి... విధి వుంది చూశావూ! అది చాలా బలవత్తర మైంది. విధి లిఖితాన్ని ఎవరూ మార్చలేరు. నా కూతురయ్యేది, నేనయ్యేది, మరొకరయ్యేది... విధికి తలవంచి తీరవలసిందే. తండ్రిగా దాని హితవు కోరాను. నచ్చ చెప్పాను. నా ఓపిక ఉన్నంత వరకూ విద్యాబుద్ధులు నేర్పించాను. నేను ఆశించి నట్లుగా అది డాక్టరుగానో టీచరుగానో కాలేదు. పోనియ్! దాన్నో గృహిణిగా చేస్తే తండ్రిగా నా బాధ్యత తీరిపోతుందని, నా శాయశక్తులా మంచి సంబంధాలు చూశాను. ఊహుఁ! దానికి ఒక్కటీ నచ్చలేదు. చెప్పానుగా! విధి లిఖితం. అదెలా వుందో నా కెందుకిక? రిటైరయి మూడేళ్ళయింది పవిత్ర పినాకినీ నదిలో స్నానం చేయటం, పెరుమాళ్ళు శ్రీరంగనాయకుని అర్చించు కోవటం నా శేష జీవిత ధ్యేయంగా మలచుకున్నాను. నిజానికి చిన్నతనంలో మా సాంప్రదాయానుసారం 'దీక్ష' పొందాను. కానీ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని భుక్తి కోసం ఎన్నుకున్నాక, నా దగ్గర చదువుకునే పిల్లలలోనే

పెరుమాళ్ళును చూడటం నేర్చుకున్నాను. వేకువఝాము కాస్సేపు 'తిరుమంత్ర జపం' తప్ప ఎక్కువ సేపు దేవుని స్మరించినది లేదు.

ఇప్పుడు తీరిక దొరికింది. చేసే పనేమీ లేదు. అన్నట్లు నా భార్య శ్రీలక్ష్మి పోయిన ఏడాదే చనిపోయింది."

ఆ తర్వాత ఆయన మరేవో నాలుగు కబుర్లు చెప్పి వెళ్లిపోయాడు. గోవిందరాజస్వామిని దర్శించుకుని వచ్చాక మూడోరోజు రాత్రి హఠాత్తుగా గుండెపోటు వచ్చి మరణించారు శ్రీహరిరావుగారు.

తండ్రి మరణంతో కమల మనసును ఆవహించిన భూతం ఒక్కసారిగా దిగి పారిపోయింది.

ఏడాది క్రింద అమ్మ చనిపోయింది. ఇప్పుడు నాన్న పోయారు. ఒంటరిగా తను... నాన్న ఇన్సూరెన్స్ తాలూకు ఆరువేల రూపాయల డబ్బూ, పదిహేనువేలు ఫిక్స్ డ్ డిపాజిట్ డబ్బూ మిగిల్చి పోయారు.

"ఇక ఇంతటనైనా, మీ బంధువులలో పెద్దలెవరైనా తెచ్చిన సంబంధం అంగీకరించి పెళ్ళాడమ్మా కమలా" అన్నారు కేశవరావుగారు కమల మూర్ఖత్వానికి నొచ్చుకుంటూ, స్నేహితుని హఠాన్మరణానికి బాధ పడుతూ.

కమల మాట్లాడలేకపోయింది. తండ్రిని మానసికంగా హింసించటమైతే బావుంది గానీ, బొత్తిగా ఇలా తండ్రి చనిపోవటాన్ని, అందు మూలంగా ఏర్పడిన శూన్యాన్ని భరించలేక పోతోంది.

"మీ నాన్న ఆలోచన ఎంత ఉన్నతమైందో నీకు అర్థం కాలేదు. ఆయనకు తెలుసు అంతస్తుల తేడాలు, డబ్బు విలువలు, ఆత్మగౌరవం విలువలు. నువ్వాయాన్ని అర్థం చేసుకోలేక పోయావంతే" అని వెళ్ళిపోయారు, వెళ్ళే ముందు డబ్బు సాయం ఏదేనా కావలిస్తే తీసుకోమన్నారు.

పెళ్ళికి కట్నం వగైరా ఏదేనా సర్దుబాటు చేయవలసి వస్తే తను చేయగలనని చెప్పారు, కమల సన్నిహిత బంధువులతో,

ఆ తర్వాత కమల జీవితం చిత్రంగా మలుపు తిరిగింది

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments